




# స్టార్ త్రినేత్రం

PRGI NO: TGTEL/25/A0438

అనుక్షణం అక్షరసత్యం — తెలుగు దినపత్రిక



| వరంగల్ | సంపుటి : 02 | సంచిక : 75 | ఎడిటర్ : డి.శివకృష్ణ | మంగళవారం | 29-09-2026 | పేజీలు : 04 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|---|
| WARANGAL | VOL : 02 | ISSUE : 75 | EDITOR : D.SHIVAKRISHNA | TUESDAY | 29-09-2026 | PAGES : 04 | PRICE : 2/- |

Published From Warangal : Circulated in Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Medak, Karimnagar, & TG All Districts


# కేటీఆర్ రివేంజ్ ప్లాన్!

## వరుస ఓటములకు బ్రేక్ పడేనా?..

## ఎమ్మెల్సీ పోరులో కేటీఆర్ సంచలన వ్యూహం!



**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**

2023 అసెంబ్లీ ఎన్నికల వరకు పదేళ్లపాటు తెలంగాణలో తిరుగులేని అధికారాన్ని కొనసాగించిన బీఆర్ఎస్‌కు ఆ తర్వాత వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి అనంతరం జరిగిన ఏ ఎన్నికలోనూ ఆ పార్టీకి ఆశించిన స్థాయిలో ఫలితాలు దక్కలేదు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క స్థానంలోనూ విజయం సాధించలేకపోయిన బీఆర్ఎస్.. కంటోన్మెంట్ ఉపఎన్నికలోనూ పరాజయాన్ని చవిచూసింది. ఇదే సమయంలో గత 3 పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నుంచి బీఆర్ఎస్ తప్పుకోవడంతో బీజేపీ, స్వతంత్ర అభ్యర్థులు విజయాలు సాధించారు. ఈ పరిణామాల నేపథ్యంలో మార్చి 2027లో ఖాళీ కానున్న వరంగల్, ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ పట్టభద్రుల స్థానాలపై బీఆర్ఎస్ అధిష్ఠానం ప్రత్యేకంగా దృష్టి సారించింది.

**ఈ రెండు స్థానాల్లోనూ గెలుపే లక్ష్యం..**

ఈ స్థానాల్లో పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడంతో పాటు

(మిగతా 2లో..)

# ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ..

## అసెంబ్లీ గెజిట్ విడుదల

**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**



ఖైరతాబాద్ శాసనసభ నియోజకవర్గం ఖాళీ అయినట్లు తెలంగాణ శాసనసభ సచివాలయం అధికారిక గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు పడటంతో ఈ స్థానం ఖాళీ అయినట్లు అసెంబ్లీ కార్యదర్శి రెండ్ల తిరుపతి

(మిగతా 2లో..)

# ఖైరతాబాద్ బై?పోల్.. కిషన్‌రెడ్డికి మరో పరీక్ష?

## జూబ్లీహిల్స్‌లో దెబ్బ!

## అమిత్ షా ఎంట్రీతో వ్యూహం మారుతుందా?



**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**

తెలంగాణ రాజకీయం మరోసారి తీవ్ర ఆసక్తికరంగా మారింది. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో దానం నాగేందర్ అనర్హతపై సుప్రీంకోర్టు ఇచ్చిన సంచలన తీర్పుతో ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉపఎన్నిక అనివార్యమైంది. వచ్చే రెండేళ్లలో రాష్ట్ర శాసనసభకు సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, ఖైరతాబాద్ పోరు అధికార కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్షాలకు ఒక "లిట్మస్ టెస్ట్"గా మారనుంది. అయితే, ఈ రేసులో కాంగ్రెస్, బీఆర్ఎస్ వ్యూహాలు ఒకెత్తయితే.. భారతీయ జనతా పార్టీలో ముఖ్యంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చుట్టూ జరుగుతున్న చర్చ ఆసక్తిని రేపుతోంది.

**కిషన్‌రెడ్డికి మరో పరీక్ష?**

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో ఎలాగైనా అధికారంలోకి రావడమే లక్ష్యంగా బీజేపీ అధిష్టానం ఇప్పటికే అడుగులు వేస్తోంది. అందులో భాగంగానే తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా సంస్థాగత అనుభవం ఉన్న సునీల్ బన్సల్‌ను నియమిస్తూ జాతీయ నాయకత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఒకవైపు సంస్థాగతంగా మార్పులు జరుగుతుంటే, మరోవైపు ఈ ఉపఎన్నిక కిషన్ రెడ్డికి అగ్నిపరీక్షగా మారనుందనే టాక్ వినిపిస్తోంది. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం కిషన్ రెడ్డి ప్రతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలోకి వస్తుంది. సొంత పార్లమెంట్ పరిధిలో వచ్చే ఉపఎన్నిక కావడంతో బీజేపీ గెలుపోటములు కిషన్ రెడ్డి రాజకీయ ప్రతిష్టతో ముడిపడి ఉన్నాయనే చర్చ జరుగుతోంది.

(మిగతా 2లో..)

# ఎలక్షన్ కమిషన్ బీజేపీకి తొత్తు

## టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**



కేంద్రంలోని నరేంద్ర మోడీ, అమిత్ షాల వైఖరితో దేశంలో ప్రజాస్వామ్యం తీవ్ర ముప్పులో పడిందని, ప్రపంచ దేశాలన్నీ భారత్ తీరు చూసి ముక్కున వేలేసుకుంటున్నాయని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ సూచనలతో ఎలక్షన్ కమిషన్ (ఈసీ) బీజేపీకి తొత్తుగా మారి, నిష్పాక్షికతను వదిలేసి ప్రవర్తిస్తోందని తీవ్ర స్థాయిలో ఆరోపించారు. సోమవారం

(మిగతా 2లో..)

# ఓటుకు నోటు కేసు..

## సీఎం రేవంత్ రెడ్డికి బిగ్ రిలీఫ్



**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**

ఓటుకు నోటు కేసులో సీఎం రేవంత్ రెడ్డికి బిగ్ రిలీఫ్ లభించింది. గతంలో ఈడీ అటాచ్ చేసిన రూ.50 లక్షల ఉత్తర్వులను పీఎంఎల్ఏ అప్పిలేట్ ట్రైబ్యునల్ రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ కేసులో ఏసీబీ ఇప్పటికే రూ.50 లక్షల్ని స్వాధీనం చేసుకుని ట్రయల్ కోర్టులో భద్రపరిచిందని, అంతే మొత్తాన్ని ఈడీ అటాచ్ చేయాల్సిన అవసరం లేదని ట్రైబ్యునల్ స్పష్టం చేసింది. 2015వ సంవత్సరంలో ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డిపై ఓటుకు నోటు కేసు నమోదయింది.

(మిగతా 2లో..)

# 'ఇది ప్రజా పాలనా?.. వంచనా?':

## కమిషన్లు ఇవ్వలేదనే బిల్లులు ఆపారా?..

## సచివాలయంలో ఆందోళనపై హరీశ్ రావు ఫైర్



**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**

పరిపాలనకు కేంద్రంగా ఉండాల్సిన రాష్ట్ర సచివాలయం కాంగ్రెస్ పాలనలో నిరసనల అడ్డాగా మారడం సిగ్గుచేటని మాజీ మంత్రి హరీశ్ రావు ప్రభుత్వాన్ని విమర్శించారు. రిటైర్డ్ ఉద్యోగులు, కాంట్రాక్టర్లు సచివాలయం వేదికగా ఆందోళనకు దిగాల్సిన దుస్థితి రావడం సీఎం రేవంత్ రెడ్డి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తలదించుకోవాల్సిన విషయం అని ఎద్దేవా చేశారు. తమ పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ సోమవారం సచివాలయంలో చిన్న కాంట్రాక్టర్లు, రిటైర్డ్ ఉద్యోగులు ఆందోళనకు దిగడంపై హరీశ్ రావు స్పందించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసిన ఆయన.. ఏళ్ల తరబడి బిల్లులు పెండింగ్‌లో పెట్టి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోకుండా ఇంకెంత కాలం తప్పించుకు తిరుగుతారని ప్రశ్నించారు.

(మిగతా 2లో..)

# కుంకీ ఏనుగులను రంగంలోకి దించండి

## డిప్యూటీ సీఎం పవన్ ఆదేశం

**అమరావతి:**



అడవుల్లో ఏనుగుల కదలికలపై అటవీశాఖ అధికారులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు.

(మిగతా 2లో..)

# ఆసియా క్రీడల్లో ఈషా సింగ్‌కు వెండి పతకం..

## సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు

**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**



జపాన్‌లో జరుగుతోన్న 2026 ఆసియా క్రీడల్లో భారత షూటర్ ఈషా సింగ్ రజత పతకం సాధించింది. ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. ఆసియా క్రీడల్లో మహిళల 25 మీటర్ల పిస్టల్ వ్యక్తిగత విభాగంలో భారత స్టార్ షూటర్, తెలంగాణ ముద్దుబిడ్డ హైదరాబాద్ నగరానికి చెందిన ఈషా సింగ్ వెండి పతకం సాధించడం పట్ల ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఐదుసార్లు షూటాఫ్‌లలో ఒత్తిడిని ధైర్యంగా ఎదుర్కొని, స్వల్ప తేడాతో బంగారు పతకాన్ని కోల్పోయినా ఆమె ప్రదర్శన అద్భుతమని ప్రశంసించారు. ఈషా సింగ్ పోరాట స్ఫూర్తి క్రీడాలోకానికి ఆదర్శమని పేర్కొన్నారు. భవిష్యత్తులో అంతర్జాతీయ వేదికలపై మరెన్నో గొప్ప విజయాలు అందుకొని దేశ ప్రతిష్ఠను, తెలంగాణ కీర్తిని చాటాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

ఆసియా క్రీడాల్లో సోమవారం జరిగిన ఫైనల్ పోరులో టై బ్రేకర్‌లో చైనా షూటర్ జియావో చేతిలో ఈషా సింగ్ ఓడిపోయింది. స్వర్ణం కోసం చివరి వరకు పోరాడిన ఈషా.. టై బ్రేకర్‌లో మాత్రం 2-3 తేడాతో పరాజయం పాలై.. రజత పతకాన్ని సొంతం చేసుకుంది. ఫైనల్లో మొత్తం ఆరు షూటాఫ్‌లను ఈషా సింగ్ ఎదుర్కొంది. ఇందులో నాలుగు సిల్వర్, బ్రాంజ్ కోసం జరిగిన పోరు కాగా.. మరో రెండు షూటాఫ్‌లు స్వర్ణం కోసం జరిగాయి. అయితే ఒక్క షాట్ తేడాతో స్వర్ణాన్ని చేజార్చుకున్న ఈషా సింగ్.. వెండి పతకంతో సరిపెట్టుకుంది.

# కేటీఆర్ రివేంజ్ ప్లాన్!

(మొదటిపేజీ తరువాయి)

గెలుపు సాధించాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ కార్యాచరణను వేగవంతం చేస్తోంది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ నేతలకు దిశానిర్దేశం చేస్తూ క్షేత్రస్థాయిలో పార్టీ బలాన్ని పెంచే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాలకు చెందిన ముఖ్య నేతలతో సమావేశమైన ఆయన.. తాజాగా మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ నేతలతో కీలక భేటీ నిర్వహించారు. పట్టభద్రుల స్థానాల్లో సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకోవడంతో పాటు ప్రజల్లో ఆదరణ ఉన్న అభ్యర్థులను గుర్తించి ముందుగానే పార్టీ కార్యక్రమాలను ప్రారంభించాలని సూచించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పట్టభద్ర ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నేతలకు ఆదేశాలు జారీ చేశారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల నమోదు ప్రక్రియ కీలకంగా మారనున్న నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులను పెద్ద సంఖ్యలో ఓటర్లుగా నమోదు చేయించే దిశగా పార్టీ శ్రేణులు పనిచేయాలని కేటీఆర్ సూచించినట్లు సమాచారం. అభ్యర్థుల ఎంపికలోనూ సామాజిక సమీకరణాలతో పాటు స్థానికంగా ఉన్న ప్రజాదరణ, పట్టభద్ర వర్గాలతో సంబంధాలు, క్షేత్రస్థాయిలో పార్టీకి ఉన్న అనుకూలత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని పార్టీ నాయకత్వం భావిస్తోంది. ఇదే సమయంలో కాంగ్రెస్, బీజేపీలు కూడా పట్టభద్రుల స్థానాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ బలమైన అభ్యర్థులను రంగంలోకి దించేందుకు కసరత్తు చేస్తున్నాయి. దీంతో 2027లో జరగనున్న ఈ ఎన్నికలు ప్రధానంగా 3 పార్టీల మధ్య పోటీగా మారే అవకాశం కనిపిస్తోంది.

**కేటీఆర్ క్షేత్రస్థాయి ప్రయత్నాలు..**

అధికార కాంగ్రెస్‌కు ఉన్న రాజకీయ బలం, మరోవైపు బీజేపీ కొనసాగిస్తున్న దూకుడు నేపథ్యంలో పట్టభద్రుల స్థానాల్లో బీఆర్ఎస్ విజయాన్ని సాధించడం పార్టీకి కీలకంగా మారింది. 2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత వరుస పరాజయాలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించడం ద్వారా పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నింపాలని బీఆర్ఎస్ నాయకత్వం భావిస్తోంది. అందులో భాగంగానే కేటీఆర్ స్వయంగా నేతలతో సమావేశాలు నిర్వహిస్తూ క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఓటర్ల నమోదుతో పాటు అభ్యర్థుల ఎంపిక, సామాజిక సమీకరణాలు, నియోజకవర్గాల వారీగా పార్టీ బలాబలాలపై దృష్టి సారిస్తున్నారు.

అయితే కాంగ్రెస్ అధికారంలో ఉండటం, బీజేపీ కూడా పట్టభద్రుల వర్గాల్లో తన ప్రభావాన్ని పెంచుకునేందుకు ప్రయత్నాలు చేస్తుండటంతో బీఆర్ఎస్‌కు ఈ పోటీ సవాల్‌గా మారనుంది. గత ఎన్నికల పరిణామాలు, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో పట్టభద్రుల స్థానాల్లో పార్టీ తన పూర్వ బలాన్ని ఎంతవరకు తిరిగి సాధించగలదన్నది ఆసక్తికరంగా మారింది. తెలంగాణ రాజకీయాల్లో మళ్లీ తన ప్రాభవాన్ని పెంచుకోవడంతో పాటు పార్టీ శ్రేణుల్లో విశ్వాసాన్ని నింపేందుకు కేటీఆర్ చేస్తున్న క్షేత్రస్థాయి ప్రయత్నాలు 2027 పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాంటి ఫలితాలను ఇస్తాయన్నది ఎన్నికల సమయానికి తేలనుంది.

# ఖైరతాబాద్ బై?పోల్.. కిషన్‌రెడ్డికి మరో పరీక్ష?

(మొదటిపేజీ తరువాయి)

### జూబ్లీహిల్స్‌లో దెబ్బ!

గతేడాది సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలోనే జరిగిన జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికలో బీజేపీ ఎదుర్కొన్న పరాభవం ప్రస్తుతం చర్చకు వస్తోంది. మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో 2025లో జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ భారీగా దెబ్బ తిన్నది. అంతకు ముందు 2023 సాధారణ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నుంచి బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డికి 25 వేల పైచిలుకు ఓట్లు వచ్చాయి. కానీ, 2025 లో జరిగిన జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో మళ్లీ అదే అభ్యర్థిని బరిలోకి దించగా ఓటింగ్ ఏకంగా 17 వేల ఓట్లకు పడిపోయి బీజేపీ మూడో స్థానానికే పరిమితమైంది. ఆ ఉపఎన్నిక సమయంలో అభ్యర్థి ఎంపిక నుంచి ప్రచారం వరకు అంతా కిషన్ రెడ్డి కనుసన్నల్లోనే జరిగిందని, దానివల్ల పార్టీలోని ఇతర కీలక నేతలు పూర్తిస్థాయిలో ప్రచారంలో సహకరించలేదనే విమర్శలు వినిపించాయి. దేశమంతా మోడీ హవా నడుస్తున్న వేళ, కేంద్ర కేబినెట్ మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి సొంత సెగ్మెంట్‌లోనే పార్టీకి ఓట్లు తగ్గడం బీజేపీ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది.

### అమిత్ షా ఎంట్రీతో వ్యూహం మారుతుందా?

వరుసగా తన లోక్‌సభ పరిధిలోనే ఉపఎన్నికలు రావడం, దాంతో తన సొంత నియోజకవర్గంలోనే ఫలితాలను నిరూపించుకోవాల్సి రావడం కిషన్ రెడ్డికి కొత్త తలనొప్పిగా మారిందనే అభిప్రాయాలు రాజకీయ వర్గాల్లో వ్యక్తం అవుతున్నాయి. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఎఫెక్ట్‌తో ఇప్పుడు ఖైరతాబాద్ విషయంలో ఆయన ఎలాంటి రూట్ మ్యాప్ అనుసరిస్తారు అనేది ఉత్కంఠగా మారింది. ఈసారి అభ్యర్థి ఎంపికతో పాటు పార్టీ కీలక నేతల సమన్వయం కోసం ఎలాంటి అస్త్రశస్త్రాలు ఉపయోగించనున్నారు అనేది చూడాలి. మరో వైపు వచ్చే నెలలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలంగాణలో పర్యటించబోతున్నారు. అక్టోబర్ 4న కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

# జర్నలిస్టుల ఇళ్ల కలకు మరింత ఊతం

**వర్కింగ్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ చైర్మన్‌గా లాయక్ పాషా ఏకగ్రీవం.**
**విప్ ఆది శీనన్న సహకారంతో మరింత ముందుకు.**

**స్టార్ త్రినేత్రం, వేములవాడ :**

వేములవాడ ప్రాంతంలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు నివేశన స్థలాలు అందించడంతోపాటు ఇప్పటికే మంజూరైన స్థలాలతో ఏర్పడుతున్న జర్నలిస్టు కాలనీ అభివృద్ధికి సమన్వయంతో ముందుకు సాగేందుకు వేములవాడ వర్కింగ్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి లాయక్ పాషాను చైర్మన్‌గా ఏకగ్రీవంగా నియమిస్తూ ప్రెస్ క్లబ్ కార్యవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది.



**మంజూరైన స్థలాల అభివృద్ధిపై దృష్టి.**

వేములవాడ మున్సిపల్ పరిధిలోని ఆరో వార్డులో సర్వే నంబర్ 391లో జర్నలిస్టుల కోసం మంజూరైన నివేశన స్థలాలతో కాలనీ రూపుదిద్దుకుంటోంది,అయితే స్థలాలు మంజూరు కావడం ఒక దశ మాత్రమేనని వాటిని నివాసయోగ్యంగా మార్చేందుకు రహదారులు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని జర్నలిస్టులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో కాలనీ అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు కొత్తగా బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ లాయక్ పాషా తెలిపారు.

**60 మంది జర్నలిస్టుల స్థలాల కోసం గతంలో ప్రయత్నం..**

వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల సాధన ప్రక్రియలో గతంలోనూ లాయక్ పాషా కీలకంగా పనిచేశారు,సుమారు 60 మంది జర్నలిస్టులకు నివేశన స్థలాలు కల్పించేందుకు జరిగిన ప్రయత్నాల్లో ముఖ్య భాగస్వామ్యం కావడంతో పాటు, ప్రస్తుతం ఏర్పడుతున్న కాలనీకి సంబంధించిన పలు అంశాలపై అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లినట్లు తెలిపారు.కాలనీలో తొలి అడుగులుజర్నలిస్టు కాలనీలో మొట్టమొదటిసారిగా బొడ్రాయి ఏర్పాటు చేసి నిర్మాణ ప్రక్రియకు శ్రీకారం చుట్టడం, ఇంటి నంబర్ తీసుకోవడం వంటి కార్యక్రమాలు లాయక్ పాషా ఆధ్వర్యంలోనే జరిగాయి. కాలనీకి విద్యుత్ సౌకర్యం కూడా అందుబాటులోకి వచ్చిందిఇవి కాలనీ నిర్మాణానికి ప్రాథమిక వసతులు ఏర్పడుతున్నాయనడానికి సంకేతాలుగా నిలుస్తున్నాయి.

**నీటి సమస్యకు రెండు బోర్లు..**

కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనపై ఇటీవల ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం సమర్పించినట్లు లాయక్ పాషా తెలిపారు. జర్నలిస్టు కాలనీ అవసరాలను వివరించడంతో రెండు బోరుబావులు మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు, నీటి వసతి ఏర్పాటైతే కాలనీలో నిర్మాణ పనులు, భవిష్యత్తులో నివాసం ఏర్పరుచుకునే కుటుంబాలకు కొంతమేర ఇబ్బందులు తగ్గే అవకాశం ఉంది.

**మిగిలిన అర్హులకూ స్థలాలే లక్ష్యం..**

ప్రస్తుతం మంజూరైన స్థలాలతో పాటు ఇంకా కొంతమంది అర్హులైన జర్నలిస్టులకు నివేశన స్థలాలు అందాల్సి ఉందని లాయక్ పాషా తెలిపారు. అర్హత ఉన్న ప్రతి జర్నలిస్టుకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి స్థలాల సాధనకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

**సొసైటీ ముందున్న అసలు సవాలు ఇదే..**

హౌసింగ్ సొసైటీకి చైర్మన్ నియామకంతో బాధ్యత పూర్తికాదని,ఇప్పటికే మంజూరైన స్థలాలను పూర్తి స్థాయి జర్నలిస్టు కాలనీగా తీర్చిదిద్దడమే అసలు సవాలన్నారు, వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో జర్నలిస్టుల హక్కులు, సంక్షేమంపై మరింత ముందుకు సాగుతామన్నారు.భూమి, రహదారులు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలతో పాటు అర్హులైన మిగిలిన జర్నలిస్టులకు స్థలాల సాధన, ప్రభుత్వ శాఖలతో నిరంతర సమన్వయం వంటి అంశాలు సొసైటీ ముందున్న ప్రధాన బాధ్యతలుగా మారనున్నాయి.



ఈ నేపథ్యంలో హౌసింగ్ సొసైటీని సమర్థవంతంగా నిర్వహిస్తూ జర్నలిస్టులందరి భాగస్వామ్యంతో కాలనీ అభివృద్ధికి కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉందని పలువురు జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు. ఏకగ్రీవ నియామకంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని, జర్నలిస్టుల ప్రయోజనాల కోసం అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని లాయక్ పాషా తెలిపారు.హౌసింగ్ సొసైటీ చైర్మన్‌గా నియమితులైన లాయక్ పాషకు పుర ప్రముఖులు, న్యాయవాదులు, జర్నలిస్టు సంఘం నాయకులు, సహచర జర్నలిస్టులు, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలిపారు.

# ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ..

(మొదటిపేజీ తరువాయి)

వెల్లడించారు.

**2024 ఏప్రిల్ 23 నుంచే అనర్హత అమల్లోకి..**

దానం నాగేందర్ అనర్హతకు సంబంధించి శాసనసభ కార్యదర్శి రెండ్ల తిరుపతి అధికారిక ప్రకటన జారీ చేశారు. 2024 ఏప్రిల్ 23వ తేదీ నుంచే దానం నాగేందర్‌పై అనర్హత వేటు అమల్లోకి వస్తుందని గెజిట్‌లో స్పష్టం చేశారు. ఆ తేదీ నుంచే ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లుగా పరిగణిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ మార్పిడి నిబంధనలు, సంబంధిత చట్టపరమైన ఆదేశాల మేరకు శాసనసభ సచివాలయం ఈ చర్యలు తీసుకుంది. అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు గెజిట్ విడుదల కావడంతో ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉపఎన్నిక అనివార్యంగా మారింది.కాగా, సోమవారం ఉదయమే ఉప ఎన్నికపై దానం నాగేందర్ మీడియాతో మాట్లాడారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రభావం ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఉండదని దానం నాగేందర్ తెలిపారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలంటూ నెక్లెస్ రోడ్డులో కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో దానం నాగేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడారు. 'ఖైరతాబాద్ ఉప ఎన్నికలో దిమ్మతిరిగే ఫలితం వస్తుంది. ఎవడు కొడితే మైండ్ బ్లాక్ అవుతుందో అలా ఉంటుంది. ఈసీని అడ్డుపెట్టుకొని బీజేపీ ఓటు చోరీ చేస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో ఓటు చోరీతోనే కిషన్‌రెడ్డి గెలిచారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ వెంటనే రాజీనామా చేయాలి. 'సర్' లోపాల అంశాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకోవాలి' అని దానం నాగేందర్ అన్నారు.

# ఎలక్షన్ కమిషన్ బీజేపీకి తొత్తు

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ తీరుతో ఓటర్ల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ఎన్నికల నిర్వహణ పూర్తిగా మ్యానిపులేట్ అయ్యేలా జరుగుతోందని విమర్శించారు. ఎలక్షన్ కమిషనర్ల తీరుపై స్వయంగా అధికారులే తీవ్ర అసంతృప్తితో లబోదిబో మంటున్నారంటే పరిస్థితి ఎంత దిగజారిందో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు.

### ఓట్ల చోరీతో ప్రజాస్వామ్యానికి విఘాతం..

బిహార్లో ఆర్జేడీ, పశ్చిమ బెంగాల్లో తృణమూల్ కాంగ్రెస్ ఓటమి వెనుక ఎలక్షన్ కమిషన్ మోసపూరిత వైఖరి ప్రధాన కారణమని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత మీనాక్షి నటరాజన్ గెలవాల్సిన సీటును సైతం కుట్రపూరితంగా చోరీ చేశారని ధ్వజమెత్తారు. ఓట్ల అక్రమాల ద్వారా దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని విమర్శించారు. ఎలక్షన్ కమిషన్ అక్రమాలకు వ్యతిరేకంగా, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీల నేతృత్వంలో దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

### హాజరైన ముఖ్య నేతలు..

ఈ మీడియా సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ అజారుద్దీన్, ఎంపీలు వివేక్ వెంకటస్వామి, అనిల్ కుమార్ యాదవ్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, అంజన్ కుమార్ యాదవ్, సర్వే సత్యనారాయణలతో పాటు ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీ గణేష్, నవీన్ యాదవ్, డీసీసీ అధ్యక్షులు మోతె రోహిత్, దీపక్ జాన్, ఖాలీద్, మైనారిటీ కమిషన్ చైర్మన్ ఫహీం ఖురేషి తదితరులు పాల్గొన్నారు.

# ఓటుకు నోటు కేసు..

(మొదటిపేజీ తరువాయి)

### కేసు నేపథ్యం..

2015లో తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్ ఓటును కొనుగోలు చేసేందుకు ప్రయత్నించారన్న ఆరోపణలతో ఏసీబీ కేసు నమోదు చేసింది. ఆ సమయంలో రూ.50 లక్షల నగదును ఏసీబీ స్వాధీనం చేసుకుని రేవంత్ రెడ్డి సహా ఇతర నిందితులను అరెస్టు చేసింది. ఆ తర్వాత ఈ వ్యవహారం ఆధారంగా మనీ లాండరింగ్ కోణంలో ఈడీ కేసు నమోదు చేసి, ఆస్తులను అటాచ్ చేయగా, తాజాగా అప్పిలేట్ ట్రైబ్యునల్ ఆ నిర్ణయాన్ని రద్దు చేస్తూ రేవంత్ రెడ్డికి ఊరట నిచ్చింది.

# కుంకీ ఏనుగులను రంగంలోకి దించండి

(మొదటిపేజీ తరువాయి)

చిత్తూరు జిల్లా పడిపుట్లబైలులో ఏనుగుల సంచారంపై ఆయన సోమవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏనుగులు మనుషులపై దాడి చేయకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పడిపుట్లబైలు ఏనుగులను తిరిగి అడవిలోకి మళ్లించేలా చర్యలు తీసుకోవాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే అవసరమైన ప్రాంతాల్లో కుంకీ ఏనుగులను రంగంలోకి దించాలని తెలిపారు

హనుమాన్ టీమ్స్, పోలీసు, రెవెన్యూ సిబ్బంది సహాయంతో నిరంతరం నిఘా ఉంచాలని, ఏనుగులు సంచరించే మార్గాల్లో ఉండే నివాసితులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. అలాగే ఏనుగుల దాడిలో తీవ్రంగా పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

# 'ఇది ప్రజా పాలనా?.. వంచనా?':

(మొదటిపేజీ తరువాయి)

### కమిషన్లు ఇవ్వలేదని బిల్లులు ఆపుతారా?:

బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ చిన్న కాంట్రాక్టర్లు, రిటైర్డ్ ఉద్యోగుల బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో పెట్టడం దారుణం అని హరీశ్ రావు దుయ్యబట్టారు. పెండింగ్ బిల్లుల మంజూరు కోసం 20 –30 శాతం కమిషన్ డిమాండ్ చేస్తున్నారంటూ గతంలో సచివాలయంలో ఆర్థిక మంత్రి చాంబర్ ముందు ఆందోళనకు దిగారు. అంటే కమీషన్లు ఇవ్వలేదనే కారణంతోనే వారి బిల్లులు ఆపుతున్నారా? అని నిలదీశారు. రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలు విడుదల చేస్తామని మే నెలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇచ్చిన హామీ నీటి మూటలేనా? మాటలు కోటలు, దాటితే చేతలు గడప దాటవు అనడానికి ఇంతకంటే నిదర్శనమేం కావాలి? రిటైర్డ్ ఉద్యోగులు, కాంట్రాక్టర్ల ఆవేదన వినే సమయం కూడా ఈ ప్రభుత్వానికి లేదా? అని ప్రశ్నించారు. 30 ఏళ్లకు పైగా సేవలందించిన ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు మీ ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఇదేనా? వారి గోడు ఈ ప్రభుత్వానికి పట్టదా? 2024 మార్చి నుంచి రిటైర్ అయిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు బెన్ఫిట్స్ అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటుంటే ప్రభుత్వం ఏం చేస్తున్నట్లు? అని ప్రశ్నించారు.

### ఇది ప్రజా పాలనా? వంచనా?:

సర్వీసులో దాచుకున్న సొమ్మును కూడా తిరిగి ఇవ్వకుండా ప్రభుత్వం వేధిస్తుండటం అమానవీయం, అనైతికం అని సమస్యలు వినడానికే సిద్ధంగా లేని ప్రభుత్వం.. పరిష్కారం ఎలా చూపుతుందన్నారు. ప్రజల సమస్యలు వినాల్సిన ప్రభుత్వం.. ప్రజలు తమ సమస్యలు చెప్పుకోవడానికి వస్తే పోలీసులతో అడ్డుకునే దుస్థితి ఏర్పడిందని ఇదేనా కాంగ్రెస్ చెప్పిన "ప్రజా పాలన"? అని ప్రశ్నించారు. ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలు , 420 హామీలు అంటూ ప్రజలను మభ్య పెట్టడం.. అధికారంలోకి వచ్చాక ప్రజలకే అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం. ఇది ప్రజా పాలనా? లేక కాంగ్రెస్ మార్క్ వంచనా? అని ప్రశ్నించారు.

స్టార్ త్రినేత్రం
PRGI NO: TGTEL/25/A0438
అనుక్షణం అక్షరసత్యం తెలుగు దినపత్రిక
మంగళవారం TUESDAY | 29-09-2026 | పేజీలు : 04 PAGES : 04 | వెల : 2/- PRICE : 2/-

# 30వ శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన మాజీ కార్పొరేటర్ కళ్లెం

స్టార్ త్రినేత్రం, హయత్‌నగర్:



శ్రీ చక్ర సహిత మహామాయి రాజరాజేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతి ఏటా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ఈ ఏడాది 30వ వసంతంలోకి అడుగుపెడుతున్నాయి. ఈ మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయ కమిటీ రూపొందించిన ప్రత్యేక ఆహ్వాన పత్రికను హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ఆలయ కమిటీ ప్రతినిధులతో కలిసి ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. అమ్మవారి కృపాకటాక్షాలతో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తులకు గొప్ప ఆధ్యాత్మిక అనుభూతిని పంచేలా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ 30వ వార్షికోత్సవ వేడుకల్లో స్థానిక భక్తులు, ప్రజలు కుటుంబ సమేతంగా పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించి, కృపకు పాత్రులు కావాలని పిలుపునిచ్చారు. ఈ ఏడాది అక్టోబర్ 11వ తేదీ నుండి 20వ తేదీ వరకు 10 రోజుల పాటు ఉత్సవాలు వైభవంగా కొనసాగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ జగన్మాతకు వివిధ విశేష రూపాలలో దివ్య అలంకరణలు, ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు, కుంకుమార్చనలు మరియు పలు సాంస్కృతిక, భక్తి కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఆగమయ్య యాదవ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, నాయకులు వస్పరి వెంకటేష్, జనార్దన్, సురేష్ తదితరులతో పాటు ఆలయ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

# సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యం లో ప్రాథమిక పాఠశాలలో పేద విద్యార్థులకు స్టీల్ ప్లేట్స్, గ్లాస్ ల పంపిణీ కార్యక్రమం

స్టార్ త్రినేత్రం,వేములవాడ





సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈరోజు మహాలక్ష్మి వీధి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకుస్టీల్ ప్లేట్స్,గ్లాసులు పంపిణీ కార్యక్రమం చేపట్టారు పూరేల్ల రాజవ్వ జ్ఞాపకార్థం వారి కుమారుడు పురేల్ల గంగాధర్ వి ఆర్ ఫౌండేషన్ ముంబాయి వారు దాతగా వ్యవహరించి విద్యార్థులకు స్టీల్ ప్లేట్స్,గ్లాస్ ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. స్కూల్ పేద విద్యార్థులకు ఇటువంటి మంచి కార్యక్రమానికి ప్రోత్సహించి దాతగా ఉండి మాకు సహకరించినందుకు వీరికి గౌరవ అధ్యక్షులు ఇప్పపూల మమత – అజయ్, ట్రస్టు నిర్వాహకులు పిల్లి బాబురావు, ఎద్దండిరాజు– సరళ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమాజ సేవనే లక్ష్యంగా పేదలకు, పేద విద్యార్థులకు దాతల సహకారంతో అనేక సేవా కార్యక్రమాలుచేపడుతున్నామని ఇంకా మునుముందు ఎన్నోసేవాకార్యక్రమాలుచేపడతామని ఈ సందర్భంగా ట్రస్టు నిర్వాహకులు పిల్లి బాబురావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు నందగిరి సత్యం.వేముల సతీష్,గొంటి నవీన్, వాసాల హరిప్రసాద్ గాసికంటి వెంకట్ సాయి.తదితరులు పాల్గొన్నారు.

# PRGTA వరంగల్ జిల్లా నూతన కమిటీ ఏర్పాటు

స్టార్ త్రినేత్రం, వరంగల్: ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ గురుకుల టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లాలోని మైనారిటీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, జనరల్ గురుకుల సొసైటీల ఉపాధ్యాయులతో ఆదివారం జిల్లా కమిటీ నిర్మాణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు, హక్కులు, సంక్షేమ అంశాలపై చర్చించారు. అనంతరం 24 మంది సభ్యులతో నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతన కమిటీ అధ్యక్షుడిగా చీ.శివాజీ, ప్రధాన కార్యదర్శిగా ఐ.కృపాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా P.రాజు, T.వరలక్ష్మి, అధ్యక్షులుగా ఎ.రమేష్, ఆయేషా జబీన్, అదనపు ప్రధాన కార్యదర్శిగా G.స్వప్న, కార్యదర్శులుగా వీ.యాదగిరి, K.రాజు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ప్రజ్ఞా దీపిక, చక్రు, స్వప్న, ఇందిరా, అనిత, సౌజన్య, మహేశ్వరి ఎంపికయ్యారు.అన్ని యాజమాన్యాల గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. ఉపాధ్యాయుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా PRGTA రాష్ట్ర అధ్యక్షులు వేమిరెడ్డి దిలీప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి గురుకులాల కామన్ డైరెక్టరేట్ ఏర్పాటు, 010 పద్దు ద్వారా జీతాల చెల్లింపు, హెల్త్ కార్డుల జారీ, కేర్‌టేకర్ల నియామకం, గురుకుల ఉపాధ్యాయుల ఆత్మగౌరవం, సాధికారత కోసం సంఘం పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.




# విశ్వకర్మ కమిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించండి

**ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి భాస్కర్‌చారి వినతి**
**భాస్కర్‌చారి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసిన 150 మంది విశ్వకర్మ సంఘం సభ్యులు**

స్టార్ త్రినేత్రం, అబ్దుల్లాపూర్ మెట్:



అబ్దుల్లాపూర్ మెట్ మండల కేంద్రంలో విశ్వకర్మ కులస్తుల కోసం ప్రత్యేకంగా కమిటీ హాల్ నిర్మించేందుకు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ 'బి' బ్లాక్ అధ్యక్షులు సిహెచ్. భాస్కర్‌చారి ఆధ్వర్యంలో సుమారు 150 మంది విశ్వకర్మ సంఘం సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా సిహెచ్. భాస్కర్‌చారి మాట్లాడుతూ.. మండల పరిధిలోని విశ్వకర్మ కులస్తులు శుభకార్యాలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి సరైన భవన సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమాజంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన విశ్వకర్మల సామాజిక అవసరాల నిమిత్తం వెంటనే కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని కేటాయించాలని ఆయన ఎమ్మెల్యేను కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి.. విశ్వకర్మ భవన నిర్మాణానికి మండల కేంద్రంలో ఎక్కడైతే స్థలం అనుకూలంగా ఉంటుందో పరిశీలించి తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అబ్దుల్లాపూర్ మెట్ సర్పంచ్ విజయ శ్రీశైలం గౌడ్‌ను ఆదేశించారు. అనంతరం స్థానిక నాయకులు, మాజీ ఎంపీపీ బుర్ర రేఖా మహేందర్ గౌడ్, బుర్ర చంద్రం గౌడ్, వార్డు సభ్యులు మహేందర్‌లను కూడా భాస్కర్‌చారి నేతృత్వంలో కలిసి కమిటీ హాల్ స్థల కేటాయింపు ప్రక్రియ వేగవంతం అయ్యేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్. భాస్కర్‌చారితో పాటు యు. మధుసూదనాచారి, వి. రాజేంద్రాచారి, ఎస్. రాజమౌళిచారి, వి. చంద్రయ్యచారి, ఎస్. సత్తయ్యచారి, ఎస్. సురేంద్రాచారి, దినేష్‌చారి, కృష్ణచారి, శ్రవణ్‌చారి మరియు దాదాపు 150 మందికి పైగా విశ్వకర్మ కుల బాంధవులు పాల్గొన్నారు.

# గంజాయి పట్టివేత.. ఇద్దరు అరెస్ట్

**గంజాయి విక్రయానికి వెళ్తుండగా పట్టుకున్న పోలీసులు**
**అరకు నుంచి గంజాయి.. వర్ధన్నపేటలో అమ్మకానికి యత్నం**
**రూ.50,000 విలువైన గంజాయి స్వాధీనం**

స్టార్ త్రినేత్రం, వర్ధన్నపేట:




వర్ధన్నపేట మండలం కట్ర్యాల గ్రామానికి చెందిన ముత్యాల శ్యామ్/(తండ్రి భాస్కర్), వర్ధన్నపేట పట్టణానికి చెందిన పిన్నింటి భరత్/(తండ్రి సమ్మరావు) కలిసి గంజాయి విక్రయిస్తూ, సేవిస్తున్నారనే సమాచారంతో పోలీసులు సోమవారం ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. గత 2, 3 సంవత్సరాలుగా వీరిద్దరూ గంజాయి విక్రయించడంతో పాటు సేవిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ క్రమంలో సుమారు 10 రోజుల క్రితం ముత్యాల శ్యామ్ తన పాత స్నేహితుడైన సుభాష్‌ను కలిసేందుకు హైదరాబాద్, సికింద్రాబాద్ మీదుగా వైజాగ్, అరకు ప్రాంతానికి వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. అక్కడ సుభాష్ వద్ద నుంచి ఒక ప్యాకెట్‌లో ఎండు గంజాయిని తీసుకుని రైలు మార్గంలో కాజీపేటకు చేరుకున్న శ్యామ్, అక్కడి నుంచి కట్ర్యాల గ్రామంలోని తన ఇంటికి తీసుకెళ్లి దాచినట్లు విచారణలో తేలింది.తాను అరకు నుంచి ఎండు గంజాయి తీసుకొచ్చిన విషయాన్ని శ్యామ్ పిన్నింటి భరత్‌కు చెప్పినట్లు పోలీసులు తెలిపారు. అప్పటి నుంచి శ్యామ్, భరత్‌తో పాటు వర్ధన్నపేటకు చెందిన మరికొందరు వ్యక్తులు కూడా గంజాయిని సేవించినట్లు విచారణలో వెల్లడైంది. అనంతరం కట్ర్యాల గ్రామం నుంచి వర్ధన్నపేటకు వచ్చి తన స్నేహితులకు గంజాయిని విక్రయించేందుకు ముత్యాల శ్యామ్, పిన్నింటి భరత్ ఇద్దరూ కలిసి బయలుదేరారు. కట్ర్యాల గ్రామంలోని ఆటో నిలుపుదల కేంద్రం నుంచి ఆటోలో వర్ధన్నపేట వైపు వస్తుండగా ఇల్లంద గ్రామ శివారు వ్యవసాయ మార్కెట్ వద్ద వర్ధన్నపేట పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించారు.పోలీసుల విచారణలో ముత్యాల శ్యామ్, పిన్నింటి భరత్ కలిసి కొంత డబ్బును జమ చేసి శ్యామ్‌ను అరకు పంపించి అక్కడి నుంచి ఎండు గంజాయిని తీసుకొచ్చి వర్ధన్నపేటలో విక్రయించేందుకు ప్రయత్నించినట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. వీరి వద్ద నుంచి మొత్తం 1 కిలో ఎండు గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.50,000గా పోలీసులు అంచనా వేశారు. గంజాయి విక్రయానికి సంబంధించి కమ్యూనికేషన్ కోసం పిన్నింటి భరత్ ఉపయోగించిన జియో భారత్ కీప్యాడ్ ఫోన్‌ను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నిందితులు ముత్యాల శ్యామ్, పిన్నింటి భరత్‌లను అదుపులోకి తీసుకున్న పోలీసులు పూర్తి వివరాలను సేకరించి అనంతరం ఇద్దరినీ రిమాండుకు తరలించారు. వర్ధన్నపేట మండల పరిధిలో గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలను సేవిస్తున్నా, విక్రయిస్తున్నా, తరలిస్తున్నా వారి గురించి పోలీసులకు సమాచారం అందించాలని వర్ధన్నపేట పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఎన్. సాయిబాబు ప్రజలకు సూచించారు.


# నార్ముల్ మదర్ డెయిరీ ఎన్నికల్లో కాంగ్రెస్ హవా.. రెండు కాంగ్రెస్, ఒకటి బీఆర్ఎస్ విజయం

**రెండు జనరల్ స్థానాలు, ఒక మహిళా డైరెక్టర్ స్థానానికి పోలింగ్**
**విజేతలుగా భాస్కర్‌రెడ్డి, సోమిరెడ్డి, లావణ్య**

స్టార్ త్రినేత్రం, హయత్‌నగర్:




నల్గొండ-రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార యూనియన్ (నార్ముల్ మదర్ డెయిరీ) పాలకవర్గంలో ఖాళీ అయిన మూడు డైరెక్టర్ స్థానాలకు హోరాహోరీగా జరిగిన ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ పైచేయి సాధించింది. రెండు స్థానాలను కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు కైవసం చేసుకోగా, మరో స్థానాన్ని బీఆర్ఎస్ మద్దతుదారుడు దక్కించుకున్నారు. హయత్‌నగర్‌లోని ఎస్వీ కన్వెన్షన్‌లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించి, అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించారు. జనరల్ కోటాలోని రెండు స్థానాలకు పెద్దిరెడ్డి భాస్కర్ రెడ్డి, దొంతిరి సోమిరెడ్డి విజయం సాధించగా, మహిళా జనరల్ స్థానం నుంచి చీర లావణ్య ఎన్నికయ్యారు. చివరి నిమిషంలో అధికార పక్షం మద్దతుతో బరిలోకి దిగిన గూడూరు శ్రీధర్‌రెడ్డి ఓటమి పాలయ్యారు. ఫలితాల ప్రకటన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. డెయిరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. గతంలో దాదాపు రూ.70 కోట్ల నష్టాలతో మూతపడే దశకు చేరిన మదర్ డెయిరీని కాపాడేందుకు ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య విశేష కృషి చేశారని కొనియాడారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడించి ఎన్‌డీడీబీకి ఎన్‌ఓసీ ఇప్పించడంతోనే సంస్థతో ఒప్పందం కుదిరి, పాడి రైతులకు సకాలంలో పాల బిల్లులు చెల్లించగలిగామని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై మాజీ చైర్మన్ శ్రీకర్‌రెడ్డి వర్గీయులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ చైర్మన్ ప్రసంగాన్ని అడ్డుకున్నారు. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేయడంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది. అనంతరం విజయం సాధించిన నూతన డైరెక్టర్లను చైర్మన్‌తో పాటు ఇరు పార్టీల ముఖ్య నేతలు శాలువాలతో ఘనంగా సత్కరించారు.



# జిల్లా కాంగ్రెస్ మైనారిటీ వైస్ ప్రెసిడెంట్‌గా షాహిద్ పాషా నియామకం

స్టార్ త్రినేత్రం రాజన్న సిరిసిల్ల:



రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ కమిటీ మైనారిటీ విభాగం వైస్ ప్రెసిడెంట్‌గా మొహమ్మద్ షాహీద్ పాషా నియమితులయ్యారు. సోమవారం సిరిసిల్ల పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర బీసీ సలహాదారు, మాజీ రాజ్యసభ సభ్యులు వి. హనుమంతరావు, జిల్లా కాంగ్రెస్ మైనారిటీ విభాగం అధ్యక్షులు షేక్ రియాజ్ చేతుల మీదుగా షాహీద్ పాషా నియామకపత్రాన్నిఅందుకున్నారు.వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు షాహీద్ పాషాకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు నాయకులు తెలిపారు. జిల్లా మైనారిటీ విభాగాన్ని బలోపేతం చేయడంతో పాటు కాంగ్రెస్ పార్టీని జిల్లాలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా సూచించారు.తనపై నమ్మకంతో జిల్లా కాంగ్రెస్ మైనారిటీ వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు అప్పగించినందుకు షాహీద్ పాషా కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకత్వం సూచనల మేరకు మైనారిటీ వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.తన నియామకానికి సహకరించిన వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా మైనారిటీ విభాగం అధ్యక్షులు షేక్ రియాజ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మధు, వ్యవసాయమార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ కనికరపు రాకేష్. తో పాటు తనకు సహకరించిన మైనారిటీ నాయకుల కు పార్టీ నాయకులకు షాహీద్ పాషా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మహమ్మద్ అబ్దుల్ రజాక్. మహమ్మద్ సోహెల్ ఖాన్. మహమ్మద్ పసి ఉద్దీన్. తదితరులు పాల్గొన్నారు

# వాసవి సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గుద్దేటి వెంకటయ్య నియామకం

**నియామక పత్రం అందజేసిన రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ**
**మహాసభ అభివృద్ధికి, సమాజ సేవకు కట్టుబడి ఉంటా: గుద్దేటి వెంకటయ్య**

స్టార్ త్రినేత్రం, కందుకూరు:



తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అనుబంధ విభాగమైన వాసవి సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మీర్ఖాన్‌పేట గ్రామానికి చెందిన ప్రముఖ నాయకుడు గుద్దేటి వెంకటయ్య నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. 2026 నుంచి 2028 వరకు రెండేళ్ల కాలపరిమితికిగాను ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ సందర్భంగా గుద్దేటి వెంకటయ్య మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో రాష్ట్రస్థాయి బాధ్యతలను అప్పగించిన మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రెండేళ్ల పదవీ కాలంలో వాసవి సేవాదళ్ బలోపేతానికి, ఆర్యవైశ్య మహాసభ ఉన్నతికి తనవంతు పూర్తి సహకారాన్ని అందిస్తానని స్పష్టం చేశారు. మహాసభ చేపట్టే ప్రతి సామాజిక, సేవా కార్యక్రమాల్లో ముందుండి పనిచేస్తానని, ఆర్యవైశ్యుల ఆర్థిక, సామాజిక ఎదుగుదలకు నిరంతరం తోడ్పాటునందిస్తానని పేర్కొన్నారు. గుద్దేటి వెంకటయ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియామకం పట్ల మీర్ఖాన్‌పేట గ్రామస్థులు, ఆర్యవైశ్య ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.

# ముఖ్యమంత్రిసభనువిజయవంతం చేయండి

## వి.హనుమంతరావుపిలుపు





**స్టార్ త్రినేత్రం, వేములవాడ :**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 30వ తేదీ బుధవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఓబీసీ భారత జాతీయఅధ్యక్షుడువి.హనుమంతరావుపిలుపునిచ్చారు.సోమవారం వేములవాడ పట్టణంలోని మున్నూరు కాపు సత్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు భారత్ జోడో యాత్ర నిర్వహించిన విషయాన్ని ఆయనగుర్తుచేశారు.దేశంలో ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగపరమైన హక్కులు అందుతున్నప్పటికీ, బడుగు బలహీన వర్గాల్లో అధిక జనాభా కలిగిన బీసీలకు తగిన న్యాయం జరగాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ జనాభా లెక్కలు చేపట్టాలని పలుమార్లు కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. బీసీలకు న్యాయం చేయడంతో పాటు కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు: బొప్ప దేవయ్య
మున్నూరు కాపు జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో పేదలకు సరైన వసతులు కల్పించలేదని విమర్శించారు. పేదలు, రైతులు, కూలీలు తమ పశువులను ఉంచుకునేందుకు కూడా ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు ఆర్థిక సహాయం అందిస్తోందని, అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రతి అర్హుడికి రేషన్ కార్డు: ఇప్పపూల అజయ్
మున్నూరు కాపు వేములవాడ పట్టణ ఉమ్మడి అధ్యక్షుడు ఇప్పపూల అజయ్ మాట్లాడుతూ, గతంలో కొత్తగా ఏర్పడిన కుటుంబాలకు రేషన్ కార్డులు మంజూరు కాలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డులు అందిస్తూ పేదలను ఆదుకుంటోందని తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిరిసిల్లలో నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేసి, నియోజకవర్గంలో ఇంకా మిగిలి ఉన్న అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ద్వారా అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వాన్ని కోరుతామని తెలిపారు.

ప్రజలకు అండగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్: కొమురయ్య
మున్నూరు కాపు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కూరగాయల కొమురయ్య మాట్లాడుతూ, ప్రస్తుత ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ఎల్‌ఓసీలు మంజూరు చేస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు.వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నిరంతరం ప్రజల మధ్య ఉంటూ పార్టీలకు అతీతంగా ప్రజలకు సేవ చేస్తున్నారని కొనియాడారు. వేములవాడ నియోజకవర్గంతో పాటు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు.ఈ సమావేశంలో మున్నూరు కాపు జిల్లా ప్రధాన కార్యదర్శి పోనిశెట్టి శంకర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎర్రం మల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు నామాల పోశెట్టి, జిల్లా ప్రచార కార్యదర్శి బొప్ప బిక్షపతిపటేల్ , వేములవాడ పట్టణ సంఘం అధ్యక్షుడు కోయినేని బాలయ్య పటేల్, పటేల్ సంఘం అధ్యక్షుడు సారా శ్రీనివాస్ పటేల్, బోనాల మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు శంకర్ పటేల్, సాసాల రాజారాం పటేల్, చింతపంటి లక్ష్మీరాజ్యం పటేల్ తదితర మున్నూరు కాపు సంఘం నాయకులు, కుల పెద్దలు పాల్గొన్నారు.

# ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ నిరసన

**సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ డిమాండ్**
**సీఈసీ దిష్టిబొమ్మ దహనం.. భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు**
**ఓటు హక్కును దెబ్బతీసే ప్రయత్నాలను సహించం: మహమ్మద్ అయూబ్**
**ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తాం: డబ్ల్యూడీసీసీ ప్రెసిడెంట్**
**ముఖ్య అతిథులుగా హాజరైన కుడా చైర్మన్ గుండు సుధారాణి**
**ముఖ్య అతిథులుగా హాజరైన శాసనమండలి సభ్యుడు బస్వరాజు సారయ్య**

**స్టార్ త్రినేత్రం, వరంగల్:**
కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వైఖరిని నిరసిస్తూ, ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వరంగల్ పోచమ్మైదాన్ సెంటర్‌లో సోమవారం పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. భారత జాతీయ కాంగ్రెస్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు భారీగా పాల్గొని కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో భాగంగా ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, నిష్పక్షపాతత్వం ఉండాలని, ఓటర్ల హక్కులను కాపాడే విధంగా ఎన్నికల ప్రక్రియ కొనసాగాలని కోరుతూ జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

### భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు..



ఈ కార్యక్రమానికి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, శాసనమండలి సభ్యుడు బస్వరాజు సారయ్య, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ గుండు సుధారాణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లా కమిటీ సభ్యులు, మండల అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, టౌన్ నాయకులు, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పోచమ్మైదాన్ సెంటర్‌లో కాంగ్రెస్ శ్రేణులు నినాదాలు చేస్తూ నిరసన చేపట్టడంతో కొంతసేపు రాజకీయంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది.కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహరిస్తున్న తీరుపై తమకు అభ్యంతరాలు ఉన్నాయని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం నిలిచేలా నిర్ణయాలు ఉండాలని, ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రజాస్వామ్య హక్కు కాబట్టి దానిని ప్రభావితం చేసే విధానాలను తాము వ్యతిరేకిస్తామని తెలిపారు. ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై కూడా కాంగ్రెస్ పార్టీ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది.

### జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి: మహమ్మద్ అయూబ్

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని అవమానపరుస్తూ, ఎన్నికల వ్యవస్థను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తోందని ఆయన ఆరోపించారు. రాజ్యాంగ సంస్థలు స్వతంత్రంగా పనిచేయాల్సిన అవసరం ఉందని, వాటిని ఏ రాజకీయ పార్టీ ప్రయోజనాలకు అనుగుణంగా ఉపయోగించకూడదని అన్నారు.ప్రజాస్వామ్యానికి ఎన్నికల వ్యవస్థ వెన్నెముకగా నిలుస్తుందని, ప్రజలు తమ ఓటు ద్వారా ఇచ్చే తీర్పును ఎన్నికల ప్రక్రియ ప్రతిబింబించాల్సి ఉంటుందని మహమ్మద్ అయూబ్ పేర్కొన్నారు. ఎన్నికలు అధికారంలో ఉన్న రాజకీయ పార్టీల ప్రయోజనాలకు వేదికగా మారకూడదని, ప్రజల తీర్పు స్వేచ్ఛగా, పారదర్శకంగా వెలువడేలా ఎన్నికల వ్యవస్థ పనిచేయాలని అన్నారు. రాజ్యాంగ సంస్థలను తమ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవాలనే ప్రయత్నాలను ప్రజలు సహించరని ఆయన వ్యాఖ్యానించారు.అధికారంలో ఉన్నామనే అహంకారంతో ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసే చర్యలకు పాల్పడితే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని అయూబ్ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని, రాజ్యాంగ సంస్థల స్వతంత్రతను కాపాడే వరకు తమ పోరాటాలు కొనసాగుతాయని తెలిపారు.

### ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణపై అభ్యంతరాలు

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ విషయంలో ఇతర ఎన్నికల కమిషనర్ల అభిప్రాయాలను పక్కన పెట్టి ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నారనే ఆరోపణలపై జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని మహమ్మద్ అయూబ్ డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాలో పేర్ల చేర్పులు, తొలగింపులు, సవరణలకు సంబంధించిన ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని, అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరుకూ తన ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కోల్పోకూడదని అన్నారు.ఇటీవల వెలువడిన ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పరిశోధనాత్మక కథనం ప్రకారం, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత 10 నెలల్లో కనీసం 14 సార్లు ఎన్నికల సంఘం తీసుకున్న కొన్ని చర్యలపై అధికారికంగా అభ్యంతరాలు నమోదు చేసినట్లు వెల్లడైంది. కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల పేర్ల తొలగింపు, ఓటర్ల జాబితాకు సంబంధించిన సమాచార వ్యవస్థ, ఫారం మార్పులు తదితర అంశాలపై ఈ అభ్యంతరాలు వ్యక్తమైనట్లు ఆ కథనం పేర్కొంది.మరోవైపు, ఎన్నికల సంఘం ఈ విషయంపై స్పందిస్తూ గత ఏడాది తీసుకున్న నిర్ణయాలన్నీ పూర్తి కమిషన్ ఏకగ్రీవ నిర్ణయాలేనని, కమిషన్‌లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడం నిర్ణయ ప్రక్రియలో భాగమేనని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఎన్నికల వ్యవస్థపై వస్తున్న ప్రశ్నలకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

### ఓటు హక్కును దెబ్బతీసే ప్రయత్నాలను సహించం: గుండు సుధారాణి



కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను అడ్డుపెట్టుకుని ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో ఓటు హక్కును దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని కుడా చైర్మన్ గుండు సుధారాణి ఆరోపించారు. గతంలో రాహుల్ గాంధీ ఓటర్ల జాబితా, ఓటు హక్కుకు సంబంధించిన అంశాలపై ఆధారాలతో వివరించారని పేర్కొన్నారు. తాజాగా ఎన్నికల సంఘంలోని ఇద్దరు కమిషనర్లు పలు నిర్ణయాలపై అధికారికంగా అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వార్తలు రావడం వల్ల తమ పార్టీ గతంలో లేవనెత్తిన ప్రశ్నలకు మరింత ప్రాధాన్యం ఏర్పడిందని ఆయన అన్నారు.అయితే, ఈ అంశాలపై భారతీయ జనతా పార్టీ కాంగ్రెస్ ఆరోపణలను ఖండిస్తూ అవి నిరాధారమైనవని పేర్కొన్నట్లు కూడా వార్తలు వెలువడ్డాయి. దీంతో ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితా సవరణ, ఎన్నికల సంఘం అంతర్గత నిర్ణయాలపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య రాజకీయ చర్చ కొనసాగుతోంది.

### వరంగల్‌లో ఓటర్లకు నోటీసులపై అయూబ్ ఆందోళన

వరంగల్ జిల్లాలో చిన్నచిన్న కారణాలను చూపిస్తూ పలువురు ఓటర్లకు నోటీసులు జారీ చేసి వారిని భయాందోళనలకు గురిచేస్తున్నారని మహమ్మద్ అయూబ్ ఆరోపించారు. అర్హత కలిగిన ఓటర్ల హక్కులను ఎలాంటి కారణాలతోనూ దెబ్బతీయకూడదని అన్నారు. ప్రజలకు తమ ఓటు హక్కుపై ఎలాంటి అనుమానాలు, భయాలు లేకుండా ఎన్నికల ప్రక్రియ కొనసాగించాల్సిన బాధ్యత ఎన్నికల యంత్రాంగంపై ఉందని పేర్కొన్నారు.ప్రజల ఓటు హక్కును కాలరాయాలని చూస్తే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోబోదని, జిల్లా ప్రజల తరపున ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం పోరాడుతామని అయూబ్ హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఓటరుకు సమాన హక్కు, సమాన అవకాశం ఉండాలని, ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు చట్టబద్ధమైన విధానాల ప్రకారమే జరగాలని ఆయన డిమాండ్ చేశారు.

### అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం



నిరసన కార్యక్రమం అనంతరం జిల్లా కాంగ్రెస్ కమిటీ నాయకులు, మండల అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో కలిసి జిల్లా అదనపు కలెక్టర్‌ను కలిశారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అనుసరిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తున్న విధానాలపై అభ్యంతరాలను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, నిష్పక్షపాతత్వాన్ని కాపాడాలని కోరారు.ఎన్నికల సంఘం అధికారిక సమాచారం ప్రకారం ప్రస్తుతం జ్ఞానేశ్ కుమార్ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా, సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి ఎన్నికల కమిషనర్లుగా కొనసాగుతున్నారు. జ్ఞానేశ్ కుమార్ 2025 ఫిబ్రవరి 19న 26వ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

### భారీగా పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు



ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా ఓబీసీ విభాగం అధ్యక్షుడు ఒర్సు తిరుపతి, జిల్లా మహిళా అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ, జిల్లా ఎస్టీ విభాగం అధ్యక్షుడు రవీందర్ నాయక్, జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు చిలువేరు శ్రీనివాస్, మండల అధ్యక్షులు దాడి శివ, ఎండ్ల రవికుమార్, పోశాల వెంకన్న, ఇస్లావత్ సావిత్రి, రవీందర్ రెడ్డి, వర్ధన్నపేట టౌన్ అధ్యక్షుడు ఈగ దామోదర్, డివిజన్ అధ్యక్షులు జన్ను అరుణాకర్, సయ్యద్ ఇంతియాజ్, మాడుగుల రాజ్ కుమార్, పసునూరి శ్రవణ్, మొహమ్మద్ జానీ, మాజీ కార్పొరేటర్లు బస్వరాజు శిరీష–శ్రీమాన్, గుండు చందన–పూర్ణచందర్, బిల్లా శ్రీకాంత్, జన్ను రవి, జన్ను అరుణ్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు సత్యనారాయణ, జాటోత్ శ్రీనివాస్, శ్రీను గౌడ్‌తో పాటు రాష్ట్ర, జిల్లా, మండల, డివిజన్, టౌన్, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY DHEEKONDA SHIVAKRISHNA, PRINTER TELUKALA BHASKAR REDDY, PRINTED AT RAINBOW OFFSET PRINTERS, 6-8-142, SAGARA VEEDHI CHOWRASTHA, HANUMAKONDA, WARANGAL, TELANGANA-506001. PUBLISHED AT: H.NO: 7-37, ZAFFERGADH ROAD, WARDHANNAPET, WARANGAL, TELANGANA- 506313.
EDITOR: DHEEKONDA SHIVAKRISHNA. PRGI NO: TGTEL/25/A0438, CELL: 9700950084, 9948206302, email: startrinethram28@gmail.com